క్లుప్తంగా

మునీశ్వరుడికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

గుడిపాల: మండలంలోని వసంతాపురం సమీపంలో ఉన్న మునీశ్వరస్వామికి ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. మునీశ్వరస్వామికి భక్తులు పొంగళ్లు పెట్టారు.

నేడు శివాలయంలో రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి మునిరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం స్వయంభు మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ మూలవర్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం ఉదయం 7.30 గంటల నుంచి 9 గంటల మధ్య రాహుకాల సమయంలో రాహుకేతు, సర్పదోష నివారణ పూజా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

వాటర్ ఫిల్టర్ వితరణ



చిత్తూరు రూరల్: గంగనపల్లిలోని నిరాశ్రయుల వసతి గృహానికి ఆదివారం వాటర్ ఫిల్టర్‌ను మాజీ కౌన్సిలర్, పార్థసారథి నాయుడు వితరణగా ఇచ్చారు. వసతి గృహంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా గృహ నిర్వాహకులు జోసఫ్, సిబ్బంది పార్థసారథినాయుడిని సన్మానించారు.

శంఖు, చక్రం సమర్పణ



శంఖు చక్రం చూపుతున్న అర్చకులు, కమిటీ సభ్యుడు

చౌడేపల్లె: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండ వీరాంజనేయస్వామికి మండలంలోని తొప్పిరెడ్డిపల్లెకు చెందిన జె.జయకుమార్‌రెడ్డి, నిర్మల దంపతులు ఆదివారం శంఖు, చక్రం సమర్పించారు. కోరిన కోర్కెలు ఫలించడంతో ఆలయానికి పంచలోహంతో శంఖు, చక్రం తయారు చేయించి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు మునిరాజ, అర్చకుడు కృష్ణమూర్తికు అందజేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ఉద్యమాలతోనే సమస్యలకు పరిష్కారం


- ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం



మాట్లాడుతున్న విఠపు బాలసుబ్రమణ్యం

పలమనేరు: ఉద్యమాలతోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబమణ్యం అన్నారు. ఆదివారం జిల్లా యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశం పట్టణంలోని లయన్స్‌సేవా కేంద్రంలో నిర్వహించారు. ముఖఅతిథిగా ఆయన మాట్లాడుతూ, హక్కుల సాధనే లక్ష్యంగా అందరూ పనిచేయాలన్నారు. ఉపాధ్యాయుల హక్కుల సాధనలో యూటీఎఫ్ ఎనలేని కృషిచేస్తోందన్నారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్, రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు, రఘునాథరెడ్డి, జీవీరమణ, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

నాగదేవతల రాళ్ల ప్రతిష్ఠ



పులిచెర్ల(కల్లూరు): మండలంలోని ఎర్రపాపిరెడ్డిగారిపల్లెలో ఆదివారం కొత్తగా నాగదేవత రాళ్ల ప్రతిష్ఠ, అశ్వర్థనారాయణ కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు అనంతాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

వార్డు విజేతలు వీరే

పూతలపట్టు నియోజకవర్గంలో గెలుపొందిన వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు

పూతలపట్టు(యాదమరి): పూతలపట్టు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పది వార్డులకు ఎన్నికలు నిర్వహించగా అందులో ఎనిమిది ఏకగ్రీవం అయ్యాయి. అందులో 6 వైఎస్సార్‌సీపీ, 2 టీడీపీ అభ్యర్థులు ఏకగ్రీవం అయ్యారు. మిగిలిన రెండు స్థానాల్లో ఎన్నికలు జరగగా రెండింటిలోనూ వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థులు గెలుపొందారు.



కల్యాణి, వార్డు 2, నల్లంగాడు, బంగారుపాళ్యం మండలం



అనురాధ, వార్డు2, మొగిలివారిపల్లె, బంగారుపాళ్యం మండలం



పద్మావతి, వార్డు 06, మోర్థానపల్లె, యాదమరి మండలం



ఆర్కాడ్ రజని, వార్డు2, కాశిరాళ్ల యాదమరి



కోదండరెడ్డి, వార్డు 5, వరదరాజులపల్లె, యాదమరి



జయచంద్ర, వార్డు 7, ఎం.పైపల్లె ఐరాల



మౌనిక, వార్డు 5, కాణిపాకం ఐరాల



కిరణ్‌కుమార్, వార్డు 1, తేనేపల్లె పూతలపట్టు

వార్డు సభ్యుడు ఏకగ్రీవం

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు మండలం ముత్తుకూరు పంచాయతీ వార్డు సభ్యుడిగా ఎం.గుణశేఖర్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. పంచాయతీలోని 10వార్డు సభ్యుడిగా వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థి ఈయన.



గుణశేఖర్, వార్డు 10, ముత్తుకూరు, చిత్తూరు మండలం

సేవాభావం కలిగి ఉండాలి

ఐరాల: వృద్ధాశ్రమంలోని వృద్ధులు పట్ల ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పేర్కొన్నారు. ఆదివారం తాళంబేడువారిపల్లెలోని సహృదయ చారిటబుల్ ట్రస్ట్, ఓల్డేజ్ హోమ్‌కు బెంగళూరుకు చెందిన దాత ఉప్పలపాటి బాలాజీనాయుడు ఎమ్మెల్యే చేతుల మీదుగా నిర్వాహకురాలు సుమతికి రూ.2 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె ఎమ్మెల్యే, దాతకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, ఎంపీపీ మోహన్ పాల్గొన్నారు.



చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, దాత

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళాన్ని యాదమరి మండలం కుక్కలపల్లెకు చెందిన వరప్రసాద్ ఆలయ అధికారులకు అందజేశారు. దాత కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం స్వామివారి దర్శనార్థం విచ్చేసి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. దాత, కుటుంబసభ్యులకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.



నేడు తహసీల్దార్ కార్యాలయంలో స్పందన

చిత్తూరు రూరల్: నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మురళీమోహన్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కార్యాలయంలో స్పందన జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావొచ్చని ఆయన పేర్కొన్నారు.

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు కమిషనర్ జె.అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి స్పందన జరుగుతుందన్నారు. అలాగే నగరంలోని 50 డివిజన్లలో ఉన్న వార్డు సచివాలయ కార్యాలయాల్లో సాయంత్రం 3 నుంచి 5 గంటల మధ్యలో స్పందన జరుగుతుందన్నారు. ఇక ప్రజలు ఇంటి నుంచే కార్పొరేషన్ కాల్ సెంటర్ 08572232745, వాట్సాప్– 9849907885కు సమస్యలు తెలియజేయవచ్చన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలుద్దాం

చిత్తూరు కార్పొరేషన్: సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలుద్దామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం స్థానిక 46వ డివిజన్ పాంచాలిపురం, విజయలక్ష్మి కాలనీలో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి గడపకు ఎమ్మెల్యే వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించి బుక్‌లెట్లు అందజేశారు. చంద్రబాబు ఇకపై ఎప్పటికీ ప్రజా తిరస్కరణ నేతగా మిగిలిపోతాడని అన్నారు. స్థానిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి వెళ్లగా పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్పొరేటర్ రెడ్డెప్ప, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు రాజా, కోఆప్షన్ మెంబర్ కోలాకిరణ్, నేతలు అమర, రోహిత్, గోపి, శివ, రవి, జ్యోతి, అల్తాఫ్, వరలక్ష్మి పాల్గొన్నారు.

నేడు 47వ డివిజన్‌లో గడప గడపకు..

స్థానిక 47వ డివిజన్ హౌసింగ్‌పై కాలనీలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటలకు వీరబ్రహ్మస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.



లబ్ధిదారుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

దోమలతో వచ్చే వ్యాధులు నివారించాలి



పూతలపట్టులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పూతలపట్టు: దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి ప్రియంకా అన్నారు. ఆదివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా పురవీధుల్లో దోమల వల్ల కలిగే వ్యాధులపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. డాక్టర్ ప్రవీణ, హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసమూర్తి, ఎంఎల్‌హెచ్‌పీ దయాకర్, సురేష్, నీహారిక, వినీశ, అశ్విని, లక్ష్మి, రోజా పాల్గొన్నారు.

నిత్య హోమశాల నిర్మాణానికి శంకుస్థాపన

తిరుపతి సిటీ : వేంకటేశ్వర వేదవర్సిటీ విద్యార్థుల సౌకర్యార్థం వర్సిటీ విద్యార్థుల వసతి సముదాయం వద్ద జేఈఓ సదాభార్గవి నిత్యహోమశాల నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ప్రతిరోజు సంధ్యా వందనం, హోమం చేసుకోవడానికి కోసం రూ.91 లక్షలతో అగ్నిశాల నిర్మాణానికి టీటీడీ అనుమతించింది. వీసీ రాణి సదాశివమూర్తి, రిజిస్ట్రార్ ఏవీ రాధేశ్యామ్ పల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న పూర్వవిద్యార్థులు

గుడిపాల: అనారోగ్యంతో బాధపడుతున్న ఉపాధ్యాయుడికి పూర్వవిద్యార్థులు విరాళం అందజేసి మానవత్వం చాటుకున్నారు. నరహరిపేట జెడ్పీ హైస్కూల్‌లో 1999–2000 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు తమ ఉపాధ్యాయుడు మల్లికార్జున్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని ఆదివారం రూ.31 వేలను ఆయనకు నరహరిపేట జెడ్పీ హైస్కూల్‌లో అందజేశారు.



మల్లికార్జున్‌కు విరాళం అందజేస్తున్న విద్యార్థులు

నేడు న్యాయవాదుల భవన నిర్మాణానికి భూమి పూజ

పుంగనూరు: పట్టణంలోని కోర్టు ఆవరణలో న్యాయవాదుల సంఘ భవన నిర్మాణ పనులను మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోమవారం ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి న్యాయవాదులు అన్ని ఏర్పాటు పూర్తి చేశారు. న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు గల్లా శివశంకర్‌నాయుడు, న్యాయవాదులు కలిసి గత నెలలో న్యాయవాదుల భవన నిర్మాణానికి ఐదు సెంట్ల స్థలం, నిధులు మంజూరు చేయాలని మంత్రి పెద్దిరెడ్డిని కోరారు. దీనిపై మంత్రి స్పందించి 5 సెంట్ల భూమిని గత వారం కేటాయించి, తహసీల్దార్ ద్వారా ఉత్తర్వులు అందజేశారు. ఆ స్థలంలో న్యాయవాదుల సంఘ భవనం నిర్మించేందుకు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప నిధుల నుంచి రూ.30 లక్షలు మంజూరు చేయించారు. ఈ పనులకు మంత్రి భూమి పూజ చేయడంతోపాటు వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

అభివృద్ధి పనులపై మంత్రి పెద్దిరెడ్డికి వినతి

రామకుప్పం: మండలంలో చేయాల్సిన అభివృద్ధి పనుల గురించి చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ ఆధ్వర్యంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి నివేదించారు. రామకుప్పంలో సీసీ రోడ్లు వేయాలని కోరారు. దీనిపై స్పందించిన సీసీ రోడ్లు వేయాలని సంబంధిత అధికారులను ఆదేశించాలని మంత్రి జిల్లా కలెక్టర్‌కు ఫోన్‌లో ఆదేశించినట్లు వారు తెలిపారు. అలాగే, మండలంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్సీకి మంత్రి సూచించారు. మంత్రిని కలిసిన వారిలో వైఎస్సార్ సీపీ నేతలు జమీను ప్రసాద్, పెద్దన్న, యశ్వంత్ రెడ్డి, పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు ఉన్నారు.



మంత్రిని కలిసిన ఎమ్మెల్సీ భరత్, వైఎస్సార్ సీపీ నేతలు

మంత్రుల మంతనాలు

ఈనెల 28న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నగరికి విచ్చేస్తున్న విషయం విదితమే. అందుకు సంబంధించిన ఏర్పాట్లలో అటు అధికారులు, ఇటు పార్టీ కేడర్ నిమగ్నమయ్యారు. సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించేందుకు ఆదివారం జిల్లామంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కళత్తూరు నారాయణస్వామి నగరిలోని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా ఇంటికి విచ్చేశారు. ఈ సందర్భంగా వారికి మంత్రి రోజా సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు తేనీటి విందు స్వీకరించారు. అనంతరం పర్యటన ఏర్పాట్లపై చర్చలు జరిపారు.

– నగిరి




మంత్రులు నారాయణస్వామి, పెద్దిరెడ్డికి స్వాగతం పలుకుతున్న మంత్రి రోజా



మంత్రి రోజా నివాసంలో తేనీరు స్వీకరిస్తున్న మంత్రులు పెద్దిరెడ్డి, నారాయణస్వామి

దోమలపై దండయాత్ర

- వర్షాకాలంలో విజృంభిస్తున్న దోమలు
- దోమల దాటికి జ్వరం, మలేరియా, డెంగీ
- కట్టడికి ప్రభుత్వం తక్షణ చర్యలు



చిత్తూరు రూరల్: వర్షాకాలం వచ్చిందంటే దోమలు దాడి చేస్తుంటాయి. జ్వరాలు, మలేరియా, డెంగీ వంటి ఫీవర్లు వణికిస్తుంటాయి. దీనికి కారణం దోమలు. ప్రాణాంతక వ్యాధులను కలుగజేసే వైరస్‌లకు కారణమవుతున్నాయి. వీటి కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపడుతోంది.

జిల్లాలో 36 మండలాలు, 5 పట్టణ ప్రాంతాలున్నాయి. ఈ పరిధిలోని 27 గ్రామాలను సమస్యాత్మకమైనవిగా జిల్లా మలేరియశాఖ అధికారులు గుర్తించారు. ఈ గ్రామాల్లో వర్షాకాలం వస్తే దోమల దాడికి మలేరియా, చికెన్‌గున్యా, డయేరియా, టైఫాయిడ్, ఫ్లూ, మెదడువాపు, డెంగీ, విషజ్వరాలు ప్రబలుతుంటాయి. ఈఏడాదికి 112 డెంగీ కేసులు నమోదు కాగా మలేరియా రెండు కేసులు మాత్రమే వచ్చాయి. గత పదేళ్లలో బోధకాలు కేసులు మాత్రం 1,110 ఉన్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. వీటి నివారణకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా పంచాయతీ, మున్సిపాలిటీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. దోమల కట్టడికి ఫాగింగ్ చేయడంతో పాటు థైమిపాస్, మలాథిన్ స్ప్రే చేస్తుంటారు. నీటి కుంటల్లో గంబూషియా చేపలను వదులుతున్నారు. డెంగీ కేసులు నమోదైతే తక్షణమే ఆ ప్రాంతాల్లో వాలిపోతున్నారు. పరిశుభ్రత కార్యక్రమాలు చేపడుతున్నారు. ఫాగింగ్ చేయించడంతో పాటు వైద్యశిబిరం ఏర్పాటు చేసి తగిన పరీక్షలు నిర్వహిస్తున్నారు. వర్షపు నీటి కుంటలు, దుకాణాలు, మరుగుదొడ్డి కుంటలు, మురుగునీటి కాలువలు, చిరు వ్యాపారులు, ఫ్యాక్టరీ వ్యర్థాలను ఆరుబయట పడేయడం, ఆస్పత్రుల నుంచి వచ్చే వ్యర్థాలు, మురుగునీటి కాలువల్లో పూడిక తీయకపోవడం, పరిసరాలు పరిశుభ్రంగా ఉండకపోవడం కూడా దోమల వ్యాప్తికి కారణమవుతున్నాయి.

ప్రైవేటు ఆస్పత్రుల్లో దోపిడి..

జ్వరం, ఒళ్లు నొప్పులతో వెళ్లిన వారిని పలు ప్రైవేటు ఆస్పత్రులు దోచుకుంటున్నాయి. డెంగీ పరీక్షలు నిర్వహించి ప్లేట్‌లెట్స్ తక్కువగా ఉన్నాయని, డెంగీ వచ్చిందంటూ భయపెడుతుంటారు. ఐసీయూలో పెట్టి రోజుకు ఒక రోగి నుంచి రూ. 10 వేలకు పైగా వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. మెడికల్ కాలేజీలో ఎలిసా పరీక్ష నిర్వహించిన తర్వాతే డెంగీ నిర్ధారణ చేయాల్సి ఉంది. వైద్యులే సొంతంగా డెంగీ నిర్ధారణ చేసి రోగులను భయపెట్టి కాసులు గుంజుకుంటున్నారు. ఇక వైరల్ ఫీవర్ అంటే రూ. 1000 వరకు ఫీజులంటూ పిండుకుంటున్నారు.



చిత్తూరులో ఫ్రై..డ్రైడేను నిర్వహిస్తున్న అధికారులు

వీరు జాగ్రత్తగా ఉండాలి..

- దోమల కుట్టడం వల్ల 12 ఏళ్లలోపు పిల్లలకు డెంగీ, టైఫాయిడ్, విషజ్వరాలు వ్యాప్తిస్తుంటాయి.
- 60 ఏళ్లు దాటిన వృద్ధులు కూడా
- గర్భిణులు, మధుమేహ వ్యాధిగ్రస్తులు
- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు
- రక్తహీనత బాధితులు

తీసుకోవాల్సిన చర్యలు..

- వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి.
- ఓవర్ హెడ్ ట్యాంకులు, నీటి పంపులు, పాత్రలపై నిరంతరం మూతలు ఉంచాలి.
- వారానికి ఒకసారి నీటిపాత్రలు, డ్రమ్ములను ఖాళీచేసి శుభ్రం చేయాలి.
- కాలువల్లో వ్యర్థాలు, చెత్త వేయరాదు.
- కిటికీలకు మెష్‌లు అమర్చుకోవాలి.
- దోమ తెరలు వాడాలి.
- శరీరాన్ని కప్పి ఉంచే దుస్తులు వాడాలి.
- దోమల నివారణకు వేపాకుతో పొగవేయడం వంటి సంప్రదాయ మార్గాలను కూడా చేపట్టవచ్చు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి..

వర్షాకాలం సీజన్‌లో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలి. ఇంట్లో, పరిసరాల్లో నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయి. రోజు విడిచి రోజు నీళ్లను తొలగించాలి. కాచి చల్లార్చిన నీళ్లను తాగితే వ్యాధులను నివారించడానికి అవకాశం ఉంటుంది. డెంగీ కేసులు నమోదైన వెంటనే చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి శుక్రవారం విధిగా ఫ్రైడే డ్రైడేను నిర్వహిస్తున్నాం.

–శ్రీనివాసులు, జిల్లా మలేరియా అధికారి



ఆటో చోరీ

- 24 గంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులు
- ఆటోతో కర్ణాటకకు వెళ్తున్న నిందితుడి పట్టివేత

గంగవరం: ఇంటి ముందు నిలిపి ఉంచిన ఆటో చోరీకి గురైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధితుడు సుబ్రమణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు..మండలంలోని రెంటకుంట్ల గ్రామానికి చెందిన సుబ్రమణ్యం అలియాస్ మణి ఆటోను లీజుకు నడుపుతున్నాడు. శుక్రవారం రాత్రి ఇంటి ముందు ఆటోను నిలిపి నిద్రపోయాడు. ఉదయం నిద్ర లేచి చూసేసరికి ఇంటి ముందున్న ఆటో లేకపోవడంతో పరిసర ప్రాంతాల్లో గాలించాడు. ఎవరో చోరీ చేశారని గ్రహించిన బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఇదే గ్రామానికి చెందిన మనోజ్(29) రెండు రోజులుగా కనిపించకపోవడంతో అతడిని అనుమానించారు. సెల్‌ఫోన్ ట్రాకింగ్ ద్వారా కర్ణాటక రాష్ట్రం ముళ్‌బాగల్ వద్ద ఆటోతో వెళ్తున్నట్లు గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆటోను స్టేషన్‌కు తరలించారు. ఇదలా ఉంచితే, గ్రామంలో చిన్నాచితకా దొంగతనాలు మనోజ్ చేసేవాడని, గ్రామస్తులే కొన్ని పర్యాయాలు పట్టుకుని దేహశుద్ధి చేసినట్లు తెలిసింది. మనోజ్ తీరుపై విసుగు చెంది అతడిని భార్య సైతం వదలి వెళ్లినట్లు విచారణలో తెలిసింది. ఇక, చోరీ చేసిన ఆటోను కర్ణాటకలో విక్రయించి సొమ్ము చేసుకుందామని తీసుకెళ్తుండగా పోలీసులు సకాలంలో స్పందించి, అతడిని ఆటో సహా పట్టుకున్నారు.